ఈనాడు E-PAPER

February 28, 2017

# విద్యాభ్యాసానికి వెళ్లి.. అమెరికాలోనే స్థిరనివాసం

- వెనక్కి వస్తోంది 5 శాతమే
- కంప్యూటర్, ఐటీ కోర్సుల్లో అత్యధికులు భారతీయులే
- హెచ్1బీ వీసాల్లో అధికం మనకే

**ఈనాడు, హైదరాబాద్:** ఉన్నత చదువుల కోసం అమెరికా వెళుతున్న భారతీయ విద్యార్థుల్లో అత్యధికులు ఉద్యోగాలు చేస్తూ అక్కడే స్థిరపడిపోతున్నారు. కేవలం అయిదు శాతం విద్యార్థులే వెనక్కు వస్తున్నారు. అమెరికాలో జాత్యహంకార ధోరణులు నెలకొంటున్న నేపథ్యంలో.. ఎక్కువ సంఖ్యలో అక్కడ ఉంటున్న మన వారికిది ప్రాణాంతకంగా మారుతోంది. అమెరికాలో చదువుతున్న వారిలో అత్యధికులు చైనీయులే అయినా, ఐటీ రంగంలో ఉద్యోగాలు సాధిస్తోంది మాత్రం భారతీయులే. అక్కడ చైనీయుల సంఖ్య సుమారు 3.30 లక్షలు. భారతీయ విద్యార్థుల సంఖ్య 1.90 లక్షలు. మన విద్యార్థుల్లో అత్యధికులకు సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, గణితం (వీటిని స్టెమ్ కోర్సులుగా పిలుస్తారు) పీజీ కోర్సుల్లో ప్రవేశాలు పొందుతున్నారు. గత ఏడాది జులైలో అమెరికా ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విడుదల చేసిన నివేదిక ప్రకారం మొత్తం విదేశీ విద్యార్థుల్లో 83 శాతం భారతీయులు స్టెమ్ కోర్సుల్లో చేరుతున్నారు. చదువు పూర్తయిన తర్వాత హెచ్1బీ వీసా పొంది ఐటీ రంగంలో స్థిరపడుతున్నారు. భారతీయులు కష్టపడతారని, అవసరమై పిలిస్తే వారాంతాల్లోనూ పనిచేస్తారన్న పేరు ఉండటంతో కంపెనీలు మన వారికే ఉద్యోగాల్లో పెద్ద పీట వేస్తున్నాయి. చదువు పూర్తయిన తర్వాత ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఓపీటీ) చేస్తూనే ఉద్యోగం చేసుకునేందుకు హెచ్1బీ వీసాలు పొందుతున్నారు. ఏటా 1.38 లక్షల హెచ్1బీలు ఇస్తుండగా 72 శాతం భారతీయులకే దక్కుతున్నాయని గత సెప్టెంబరు హైదరాబాద్‌కు వచ్చిన అమెరికా విదేశాంగ ప్రతినిధి ఒకరు వెల్లడించారు.

**స్టెమ్ కోర్సుల్లో వివిధ దేశాల విద్యార్థుల శాతం**

భారత్- 83, ఇరాన్- 78, నేపాల్- 59, చైనా- 41, సౌదీ అరేబియా- 42, తైవాన్- 33, దక్షిణ కొరియా- 21

చైనీయుల్లో సగంమంది చదువు పూర్తయిన తరువాత వెనక్కివెళుతున్నారు. మిగిలిన వారు ఒక్క ఐటీయే కాకుండా పలు రంగాల్లో వ్యాపారం చేసుకుంటున్నారు. అమెరికన్లలో ఎక్కువమంది కేవలం అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల వరకే చదువుతున్నారు. అక్కడి పీజీ కోర్సుల్లో 90 శాతానికిపైగా అమెకాయేతర విద్యార్థులే ఉంటారు. అమెరికన్లు కెరీర్‌కు కాకుండా ఆసక్తికి పెద్దపీట వేస్తారు. అందుకే సంగీతం, ఫిల్మ్ మేకింగ్ లాంటి కోర్సులు చేస్తుంటారని తెలుగు విద్యార్థులు చెబుతున్నారు.

### 600 సీట్లలో భారతీయులే 500 మంది

ఎంఎస్ కంప్యూటర్ సైన్స్ చేస్తున్నాను. ఇందులో 600 సీట్లు ఉంటే 500 మంది భారతీయ విద్యార్థులే ఉన్నారు. మిగిలిన 100 మందిలో కూడా అమెరికన్లు చాలా తక్కువ మంది. నేను ఇక్కడ రెండో పీజీ చేస్తున్నాను. రెండున్నరేళ్లుగా ఉంటున్నా.

***- ఎన్.శివకోటేశ్వర్‌రావు, సదరన్ ఆర్కాన్సస్ విశ్వవిద్యాలయం, మాగ్నోలియా***

### తుపాకుల అనుమతుల విధానాన్ని పునఃసమీక్షించాలి

ఇటీవల భారతీయ అమెరికన్లపై దాడులు జరగకుండా కఠిన చట్టాలను అమలు చేయాల్సిందిగా యూఎస్ కాంగ్రెస్‌కు ఎన్నికైన భారత సంతతికి చెందిన పలువురికి లేఖ రాశాం. తుపాకులకు అనుమతుల విధానాన్ని పునఃసమీక్షించి తగిన మార్పులు చేయాలి. జాతి వివక్ష పరిశీలన - నిరోధక కమిషన్‌ను ఏర్పాటుచేసి వచ్చిన ఫిర్యాదులన్నింటినీ పరిశీలించి చర్యలు తీసుకోవాలి.

***- డాక్టర్ ప్రసాద్ తోటకూర, జాతీయ అధ్యక్షుడు, ఇండియన్ అమెరికన్ ఫ్రెండ్‌షిప్ కౌన్సిల్***

© 2017 all rights reserved